# గుండ్లకమ్మ చెప్పిన కథ

నాగభైరవ కోటేశ్వర రావు

ఎట్లు చిత్రీకరించెనో యేమొ గాని
ధారుణీఫలక మందు చిత్రాల నిన్ని?
సృష్టికర్తకే తన సృష్టి చూడ ముచ్చ
టగును ఆశ్చర్యమగును ఆనందమగును

దిష్టు లన్నిట నొకయెడ దీర్చినట్లు
ఒలక బోసి యొయ్యారము జిలికినట్లు
పాకనాట నందంబును పారబోసె
ధాత చపల చిత్తాన నవ్విధాన నొకట.

కొండమొక్కటి అద్దాని దండ యేరు
ఆ నదీ తీరమందు యింపైన కాన
కాననము నందు నక్కడక్కడను కొన్ని
ఆదివాసుల గూడెంబు లమరియుండు

తీరముగా నిల్చి యుండుట గిరికి సొగసు,
నిలువకయు పారుచుండుట నీటి సొగసు,
ఆకు పచ్చందనమ్ము అయ్యడవి సొగసు
నీటి నొకచోట గూర్చుట విధికి సొగసు

ఇప్పుడా ఎప్పుడో కొన్ని ఏండ్లు పూండ్లు
అరుగుకయు మున్న యొక్క మధ్యాహ్న వేళ
చేటలను ఎత్తి నిప్పులు చెరగునట్లు
చండభానుండు మండు వేసంగి వేళ

ఒక్క సూర్యుడు గగనాన నిక్కిచూడ
ఉక్కపోసిన దుర్భికి— ఉక్క పోసె
వడవికిని దాని మధ్యన నడచు నదికి
దాని తీరాన ఇసుక మైదానమునకు

చెట్లకును యుక్క పోసెను చెట్ల పైని
పిట్టలుక్కకు యుక్కిరి బిక్కిరయ్యె
అడవి జంతువు లెండ కల్లాడి పోయె
భీతిచే గాలిగూడ స్తంభించిపోయె

విరహమున జిక్కి శల్యమై విభుని కొరకు
వెదకి కొను నొక్క జవరాలి విధము దోప
తీరుబాటుగ సాగె నదీ ప్రవాహ
గతులు తీవ్రమవు అతిపొగతిని జిక్కి

అటు భీతిచే కదలి
యాడవు పత్రము లెవ్వియున్, మహీ
జాతము లందు గాలియును
జాతర సేయక దాగియుండె, సం
గాతము లెన్నియున్న తిరు
గన్ భయమందు మృగంబు లన్నియున్
చేతనమెందు గానకయు
చేష్టుడి యుండె ధరాస్థలమ్మొగిన్.

అట్టి సమయాన కదలాడు నదియు నదియె,
కాదు కాదా నదీ తరంగాల యందు
సుదతి యొర్తుక ఈదుచు కదలుచుండె
నగ్నముగ— నొయ్యారముగ మీనంబు వోలె

గిండ్లు గజనిమ్మపండ్లు, పాలిండ్లు చెండ్లు
కురులు తుమ్మెద గరులు, ముంగురులు నరులు
సున్ననై జారు పిరుద లత్యున్నతములు
అనటి కంబాల తీసిపోవనివి తొడలు

మచ్చలుండుట చందమామకును మచ్చ
రేయి ముకుళింత మచ్చ నీరేజమునకు
పగలు నవ్వులు లేమి కల్వకును మచ్చ
లేమి యేమచ్చ యువతికి లేని మచ్చ

నగ్నసుందరి నొకతె నొనర్చి ధాత
మలిన రహితమ్ము గుండ్లమ్మ జలము లందు
తాన మొనరించు రమ్ము చూతమ్మటంచు
పంపగా వచ్చియున్నట్టి పడతి వేమొ

విరహతాపమ్ము దీర నెవ్విధము లేక
యే సురాంగనయో భువి కేగుదెంచి
జలములం జొచ్చి, తాప శృంఖలలు విప్ప

ఏటి దరిని నిలిచి యెంతసేపైనదో
వనిత వైపె జూచు వ్యాఘ్రియొకటి

తరుణి భయమున రాయి విధాన నిలిచె
పులియు గాండ్రించె జలద గర్జల విధాన
వివశయై కన్నులను మూసి యువతి తూగి
ఒదిగి తత్తరపాటున యుర్వి వ్రాలె

భయవశంబున పుడమిపై పడిన కన్య
నిటు తదేకముగా పులి ఈక్ష జేసి
ఇంతి చెంతకు దూకె భక్షించు కొరకు
అంతలో దూసికొని వచ్చె అమ్మొకండు

అమ్మొకటి గాటముగ పులి యాననమున
దగిలె— నంతలో నొసటిపై దగిలె నొకటి
ఒకటి యొక్కటి ఒక్కొక్క టొకటి
నాటి పేనెల్ల వ్యాఘ్రి ప్రాణాలు దోడె.
ఎచట ప్రారంభమైనదో ఏమొ అంప
వర్షమది ఎరుంగదు పులి—వార్షకాభ్ర

ఈదులాడుచు నున్నదో యువ్విధాన

వనిత యొకసారి నీట మున్గినదొ లేదొ
అందమంతయు అదృశ్య మగుచు దోచె
చెలియ యొకసారి నీట నిల్చినదొ లేదొ
అచట జలకన్య హసియించి నట్లు దోచె

మునిగి యొకసారి నీట యా ముగ్ధ నిలువ
సలిల బిందులు ముత్యాల సరళి రాలె,
లేచి యొకసారి యేట యా లేమ మునుగ
నీలి కురులన్ని అలలుగా నీట దేలె

ఈదులాడుచున్న ఇంతి సౌందర్యంబు
చకిలిగింత నదికి చక్కనిడెనొ
ఏమొగాని, నీరు ఇంతలై ఇంతలై
అలలు కలల దేలినట్లు కదలె

కలల దేలినట్లు కదలిన యలలన్ని
ఇంతి మేన చకిలిగింత లిడెనొ
ఏమొగాని ఆమె ఈదుచు పులకించి
తన్మయాన ఏటి దరికి జేరె

చేరి కనుల తడిని చేతితో దుడిచెను
ఎదుట పులిని జూచి యదిరి పడెను

నీల గంభీర దీర విశాల తనుడు
నదికి నావల నిల్చి బాణాల వేసె


వ్యాఘ్రి కూలంగ నీదుచు వచ్చి తాను
వివశయై పడియున్నట్టి యువిద గాంచి
రయమునన్ జని ఏటి నీరమును దెచ్చి
పైన చిలికించి తన్వి నంకాన జేర్చె

మగువ త్రుటిలోన కన్ను దామరలు విప్పె
ఏమి జరిగెను? ఇంతలో ఎవ్వ డితడు?
వాని యంకాన తన తల వాలుటేమి?
క్రూర శార్దూలి బాణాల గూలుటేమి?

లిప్తలో సర్వ మూహించి లేమ లేచి
చచ్చి పడియున్న పులి నొక్కసారి జూచి
చెంత గూర్చున్న ఎరుకల చిన్నవాని
చారు నయనాల దెస కృతజ్ఞతగ జూచె

తాను చెంచుల మన్నీని తనయ, యతడు
ఏటి కావల ఎరుకల పేటివాడు
వారికిని తన వారికి వరుస లేదు
కాని ఎరుకల వాడు రక్షణ మొనర్చె

ప్రాణదానమ్ము సలిపి, నా బ్రతుకు నిలిపి




నట్టి యువకాగ్రణి నీకు అంజలింతు
నను విధమ్మున చెంచెత కనుల మవున
భాషణమ్ములలో వాని ప్రశస్తిఁ దించె.

అతని కను లామె నగ్నదేహమ్ము నంత
పలుకరించుచు నున్నట్టి వరుస దోప
సిగ్గుపడి తన దేహమే మొగ్గ కాగ
ఒక్క ఉదుటున లేచి యుగ్రమాగి సాగి

డిగుచు నదిలోన గొంతు బంటిగను విర్రి
మస్తకము నెత్తి యొకసారి మరుల గొలువ
నిలిచి యున్నట్టి యాతని విలువు కెత్తు
రూపు గాంచెను తానవు రూపమంచు

నీలి దేహంబు వలపు వన్నియలు దెలిపె
వాలుగన్నులు మదనుని వరుస దెలిపె
వాని ఎత్తైన వక్షమ్ము వలపు దెలిపె
కోరమీసాలు తన మది కోర్కెలూపె

హర్షపులకిత గాత్రయై ఆశ దీర
తన విశాలంపు కన్ను లాతనిని జూడ
హర్ష సంజనితాత్మయై అతని వైపు
చేతులం దట్టి పీటిని చిక్కరించె

చిలకరింతలందు పులకించి వలవంది
ఎరుక కుర్రవాని ఎడద యూగె
చిలకరింతలందు వలపులే పిలువగా
పగలబడుచు చెంచు భామ నవ్వె

వనిత కలకల నవ్వు నవ్వడికి తనిసి
పీటి అలలన్ని శ్రుతులను మీటుచుండె
ఆమె నవ్వుల జల్లు కాహ్లాద మంది
మింట సూర్యుని వేడి శమించుచుండె

తరుణి గలగల నవ్వునాదాల నవ్వి
దండగా జేసి, మనసున దాల్చి, ఎరుక
చిన్న దా నది పీదుచు, మిన్ను నంది
తనిసి సంబరపడుచు ఆ దరికి జేరె.

నాటి రాతిరి యతడు స్వప్నాల వీధి
తేలి చూడని వలపుల దీవి లేదు
పడతి ఆ నాటి రాతిరి పవ్వళించి
మూసె కన్నులు—మనసును మూయలేదు.

● ● ●

శ్రీలు చెలువొందు వెన్నెల చీర గట్టి
రేయి జవరాలు భూమిని నర్తించు వేళ
నర్తనాహేల గాంచి ఆనంద మంది
పుడమి చేడియ ఆనంద పడెడి వేళ,

గగన మవియెడి నీలి మాగాణ మందు
తారకా సస్యముల శీతధాము డొకడు
కాపలా గాయుచును తిరుగాడు వేళ
చూడ చక్కని వేళ—సుషుప్తి వేళ

తనువు వెన్నెల యందున తళుకు లీన
తన తరంగాలు వెన్నెల దారులొచు
ముందునకు సాగ, ఎవరికో ముద్దు సేయ
కదలె గుండ్లమ్మ తూర్పుగా కడలి వైపు

ఆ ప్రవాహ గతుల అటు తూగి ఇటు సాగి
చిన్న చిన్న రాళ్ళు చిత్రముగను
గుండ్రముగుచు దీరె, గుండ్రాళ్ళుగా మారె
గుండ్లకమ్మ యాయె గుండ్లకమ్మ

పాకనాటి యందు పారు ప్రవాహమై
కులుకు లొలుకు చుండు గుండ్లకమ్మ
కంభమందు పుట్టి, కడలి నేస్తము తాను
కోరి వరుపు లెత్తు గుండ్లకమ్మ

పెన్నా కృష్ణలు సోదరుల
పిన్నారులు సవతులుగా చెలికత్తెలుగా
ఉన్నా రుత్తర దక్షిణ
తెన్నులతో తనకు పెద్ద దిక్కులు వారే!

పెన్న కృష్ణ నదులు పెద్దలు తనకన్న
వారి మధ్య సవతి పోరు లేదు
గుండ్లకమ్మ వారి గుండెల కనుగైవ
చిట్టి చెల్లి కడలి చెలుము అల్లి


నాటి రాతిరి గుండ్లకమ్మా
నిడి సైకత స్థలములందున
పుచ్చ పూవులు పూసినట్టుల
పచ్చి వెన్నెల విరియగాచెను

ఎంత తడవైన ప్రియురాలి ఎడద పూను
వెగటు గలుగని జతగాని విధము దోప
అవనియంతట చిరుగాలి యలుపు లేక
ఈల వేసెను వెన్నెల వీదులాడె
వెన్నెలొక కొంతమదికి వేడియగును
అంధకారంబె వారి కానందమగును
జారులకు చోరులకె కాదు యే రహస్య
ప్రణయులకుకూడ చీకటె వరమె యగును

అమర నిర్మల ప్రేమకు అంధకార
మెందులకు? వెన్నెలే మేటి విందొసర్చు
కాంతి కున్నట్టి విలువ చీకటికి లేదు
పూజ్యభావంపు వెలుగు తప్పునకు రాదు

నిజమె కానోపు పూర్ణిమా నిశలయందె
ప్రియుని వెదుకాడు కొనుచు గోపికలు వెదకి
యమున దరియందు బృందావనాంతరమున
ప్రాలినారని మన పురాణాలు చెప్పు

పుక్కిటి పురాణముల నటు నొక్కి పెట్టి
మనదు గాథాక్రమానికి మరలి వచ్చి




చూతమా జాను వెన్నెల సోయగముల
చల్లగాలుల ఆ నదీ సైకతముల

ఒక మహా నీలకాయుని యూరుతలము
తలగడగ జేసి పవళించె తరుణి యొకతె
మబ్బు మాటున చందమామయును జేరె
పిచ్చి చీకటి చుట్టు వ్యాపించి యుండె

ఆమె చెవిలోన నాతడేమేమి హాస్య
స్నిగ్ధ మోహన వాక్యాలు చిలికె నేమొ
పగలబడి నవ్వుచున్నది పడతి విన్న
నవ్వులే నగలగు గదా వాలికన్నె!

తట్టుకొని నవ్వుతరగల ధాటి కాగ
లేక, ఆ నది తరగలు లేతపడెను
వెలసి పోయిన మోములు వెన్నెలందు
చల్లగా జారి ముందుకు సాగిపోయె

ముగ్ధమోహన చంద్రికా మోదమందు
మూర్తులవి రెండు మోహ విస్ఫూర్తి చెలగె,
కొదమ మీసాల ఎరుకల కుర్రడతడు
ప్రాయమందున్న చెంచుల భామయామె

కులము వలపున కడ్డుగా నిలువ బోదు
జాలి, అనురాగ మరికట్టు జాలలేదు
తెగలు—ప్రేమల తీవెను త్రెంచలేవు
బేద మెరుగదు ప్రేమ అనాది నుండి

నల్లని వాడతండు నయ
నమ్ముల పద్మ పుకాంతిపుంజముల్
కొల్లగ నున్నవాడు, పులి
గోరు సరమ్మును దాల్చువాడు, యే
వల్లదనంబొ డెందమున
చక్కగ నిల్పిన వన్నెకాడు రే
యెల్ల ప్రియాంగనా సుమధు
రేక్షణ పంక్తుల సాగువాడహో!

చక్కదనాల చుక్క, విర
జాజుల నవ్వుల పూలమొక్క, న
ల్దిక్కుల లోన యందముల
తేజము బంపెడి వేగుజుక్క, ఆ
ప్రక్కన చెంచుభామిని, న
భంబున వెల్గెడి చంద్రు కన్న, సొం
పెక్కిన మోము కాంతిగల
ప్రేయసి తా జగదేక సుందరే!

ఆమె పేరు 'అంకి' అతడామె అంకాన
తలను వాల్చి కనని కలయె లేదు,
'అద్ద' డతడు ఆమె అతని కౌగిట
వ్రాలి చేయనట్టి బాసలేదు.

వారు కన్న కలలు వరుసగా జెప్పను
రేయి యైన ఇసుక రేణువైన
వారు జేసికొన్న బాసలు వర్ణించు
వెన్నెలైన ఏటి వెల్లువైన

అతడు ఎరుకల చినవాడు, అతివ చెంచు
జాతి వేరైన వారల రీతి యొకటె
ఒక్కటే ఒక్కటే అది చిక్కనైన
అమర మధురానుభవ మభయమ్ము నయము,

అంకి అధరమ్ము చుంబించి అద్దడనెను
'నుంకు పట్టిన లేజొన్న కంకి నీవు
చెలిమి వనముల పరువెత్తు జింక నీవు
వంక లేనట్టి నా నెలవంక నీవు'

రమణిబదు లిచ్చినది పరిరంభమందు
అద్దడా! పూర్వ జన్మ స్నేహంబు మనది
కాకపోయిన ఇంతటి గంధ మెట్లు
పరిమళించును వలపు తెమ్మెరల యందు'

ఎంత తడవాయెనో కౌగిలింత విడదు
ఎంత సేపాయెనో చుంబనాంతమవదు
ప్రేమ తెలియని వారల కేమి తెలియు
కౌగిలింతల ముద్దుల గతులు రుచులు?

గూడెమున కోడి కొక్కొరొకోలు చెలగె
జారె పడమర దిక్కుకు చందమామ
కాలమెంతటి కర్కశా ఘూత మగునో?
నిగుల దొకయింతసేపు ప్రేమికుల కైన

బుద్ధి కాలేదు అద్దడు పోవలేవ
కాని తప్పనిసరి వియోగంబు గాన
లేచి, చెలియను లేపి, పోలేక తుదకు
ముద్దు పెట్టెను నున్నని బుగ్గమీద

అతడు ముందుకు సాగగా అడుగు పడదు
మగువ విడిపోవగా తన మనసు విడదు
కాని తప్పనిసరి వియోగంబు కాన
మనసు నచ్చట విడిచి, ఆ తనువు నడిచె

ఆతడీదుచు నదిలోన అరుగుచుండ
ఆమె తీరాన నిలబడిఆశ దీర
చూడ, వెనుకకు మరలుచు చూచి యతడు
చేయి నాడించి వీడ్కోలు చెప్పసాగె

హాయిగా రేయి గగన విహారమంది
అలసి సొలసిన ముసలి చంద్రయ్య ఇపుడు
పడమటింటికి వేగమై పరుగు దీసె
గూడెమును జేరబోయెను కోనలాంగి

(ముగింపు వచ్చే సంచికలో)

(కిందటి సంచిక తరువాయి)

తెల్లగా తెల్లవారె — నదీ తరంగ
సమితి దినకరు కిరణ సంస్పర్శచేత
పులక లెత్తుచు సింగార మొలుకుచుండె
రసిక ప్రియువాక్కుతో ప్రియురాలు వోలె—

ఈ నదీతీరాన నెన్నెన్ని జాతులు
వికసించి ముకుళించి వెడలి నవియొ?
ఈ నదీ జలముల నెందరు వీరులు
ఖడ్గాల రుధిరంబు కడుగు కొనిరో?
ఈ నదీ జలములం దెన్నెన్ని ప్రేమైక
గాథలు వ్యథలతో గలిసి చనెనొ?
ఈ నదీ తీరాన నెన్నెన్ని రాజ్యాలు
నెలవొంది చెలువొంది నీల్గినవియొ
ఎవరి కెరుకగు? తీరపు యిసుకకేని
తీర్పి చెప్పగలేని యోదార్పులేని
ఏటి జలముల కేని మున్నీటి కేని
తెలియనట్టిది పూర్వ గాథల విధంబు—

ఏ విధమెట్లు గూడినను
యేరణమెట్లు లయించి పోయినన్
ఏ విపులార్ద్ర డెందముల
వెవ్విధి నవ్విన నాశమందినన్
కోవిదు లెంతమంది మది
కోతకు యిచ్చి నశించిపోయినన్
ఏవియు అంటి ముట్టని బు
షీశ్వరు డీనది యెంత చోద్యమో—

నదికి యావలి గట్టున ప్రథిత ముగను
చెంచు గూడెంబు నెలవొంది చెలగుచుండు
నదికి యీవలి గట్టున విదితముగను
ఎరుకలకు గూడ గూడెంబు యెసగుచుండు—

నదికి నటునిటు గూడెముల్ నడుమ యేరు
పారి వీరిని విడదీసి పారుచుండు
నదికి అటు నిటు గూడెముల్—నడుమ జాతి
భేదమే పారి వారల వేరుజేయు—

చెంచులకు నెరుకలకు మధ్య చెలగుచున్న
జాతి క్రౌర్యంబు వైరంబు జాటుచుండు
పచ్చి గడ్డిని మండించి భగ్గుమనును
కాకి అటుపోయి యిటువచ్చి కాలిపడును

ఒక్క సూర్యుండె వెలుతురు నొసగుచుండు
ఒక్క చంద్రుండె యిరువుర కొప్పుచుండు
ఒక్క నదిలోని నీరమే గుక్కతడుపు
ఒక్క జాతికి మరియొక టెక్కబోదు—

ఎడద దోచిన కుర్రడు ఎరుక వాడు

చెలిమి గైకొన్న చిన్నది చెంచు వనిత
ఉన్న దిద్దరి మధ్యన ఒక్క జాతి
అద్ది ప్రేమైక జాతి మోహంపు జాతి.

ప్రేమకెవ్వడు సరిహద్దు పెట్టగలడు?
మమత కెవ్వడు కొలబద్ద మలచ గలడు?
రెండు హృదయాల మధ్య వరించి నిలుచు
వంతెనను గూల్చి యేవాడు వరలగలడు?

కనులు వారివి యెప్పుడు కలసికొనెనొ?
చూపులకు గల్గె నెప్పుడో చుట్టరికము?
మనసు నందెప్డు పండెనో మరుల పంట
ఎరుగ వశమెవ్వరికి — యిరువురకు దప్ప?

ప్రేమ యొక్క కడలి ప్రియభాషణములందు
తరగ లగును — వలపు నురగ యగును
ఎడద వెంచిచూడ యెడబాటు సంయోగ
మాటుపోట్ల వోలె నమరియుండు —

అంకియును అడ్డదట్టి ప్రేమాంబునిధిని
ఎన్ని మునకలు వేసిరో! ఎన్నిసార్లు
తేలియాడిరో! ఈదిరో? వోలలాడి
వోడిరో గెల్చిరో జతగూడు కొనిరో?

రేయి — కలయికలతో రెక్కలు దిగజార్చు
పగలు — వేగు తీపి భావనలతొ
ప్రాలురేయియంచు, పగలు దీర్ఘమంచు
పగలు రేయి బాధె — వారి కెపుడు

అస్తమయమును దలచి శోకార్తుడగుచు
వృద్ధ సూర్యుడు కోప సమృద్ధి చేత
వెనుదిరిగి చూచి, వుక్కిలించిన విధాన
అరుణ కాంతులు గగనాన అలముకొనెను

అస్తమయమగు వెలుగుల యందమంత
చీకటెల్లలు చేర్చుక్కజేసి, నిలిచి
పశ్చిమ దిశాంగనా ఫాలభాగమందు
పేరటపు బొట్టు పెట్టిన తీరు దోచు—

దినమునకు రెండు సంధ్యల తిరమెయ్యైన
పూర్వ సంధ్యకు లేని యపూర్వమైన
తళుకు లెన్నెన్నొ — అపర సంధ్యకును దక్కు
ఎవరి ప్రాప్త మదెట్టిదో యెరుగరాదు—

# గుండ్లకమ్మ చెప్పిన కధ

## నాగభైరవ కోటేశ్వర రావు

వారి ప్రేమకు సాక్షు లెవ్వారు గలరు?
ఒక్క గుండ్లమ్మ ఒక చంద్రు డొక్కగాలి
చక్కగా ప్రక్క పరచిన సైకతములు
కటిక చీకటి తారల కాంతి దప్ప—

గుండ్లకమ్మ గుట్టు గుండె దాటదు కదా
చీకటికిని చెప్ప చేతకాదు
చందమామ మూగ సైకత స్థలి మూగ
చుక్కలన్ని మూగ దిక్కు మూగ

ఎన్ని బాసలు తాజేసి కొన్నగాని
ఎన్ని వూసులు పూకొట్టు కొన్నగాని
ఎన్ని ఘడియలు తా జారుచున్నగాని
'వామనమె' కాలమన్నది ప్రేమికులకు


ముసురు పట్టి వాన ముప్పొద్దు గురిసిన
విసరికొట్టి గాలి కసరు కొనిన
వరద వచ్చి నది ప్రవాహంబు పెంచిన
అడ్డురావు — అంకి అడ్డడులకు

అట్టి ఒకనాటి మధుర సాయంతనమున
ప్రకృతి రమణీయ కమనీయ ప్రాంతమందు
చెంచు గూడెంబు సంద్రాన చెలువు మీర
దీవి పోలిక నొప్పారి—దీప్తు లొసగు —

అట్టి నెలవుకు వెలుపల నారు బయలు
అరుబయలుకు మధ్య రంగారు వేది
వేదిపై గద్దె — గద్దెపై వెలుగుచుండె
నీల గంభీర దేహుడు — కాల సముడు

వేది ముందరి భాగాన వేచియుండె
సచివ సామంత యోధాగ్ర సైన్య చయము
దాని వెనువెంట చెంచుల తరుణు లుండ
దాని ముసుముందు పిల్లల దండు గలదు—

అంద రెందరు ఒక కొన్ని వందలుంద్రు
అందరికి రేడు దొరబాబు వందితుండు
ఒక్క దొర చెంచు లెందరో యున్నగాని
ఒక్క జాబిలి చుక్కలు పెక్కుగాని



వాడు సెమీగూడినట్లు యే వాడు గూడ
సందె సమయాన ఒక పెద్ద సభ పొసంగు
అల్ల నెలరాజు చలువల సందుకొరకు
కలువ లగుదురు ప్రజ దొర పలుకుల కయి-

ఆకృతిని తాను యమధర్మ డగును గాని
సుకృతులు జేయు సమయాసురల రాజు
చాలడతనికి — వానిలో సతుల వాంఛ
పదవికై కాంక్షలను దోష పథములుంట

నీలినేత్రాలు, బుర్రమీసాలు, తలకు
పాగ, దానికి చుంగ లొప్పారు చుండ
చూడ వలసినదే వాని సొగసు, కాని
వర్ణనము చేయుజాల దే వాక్కు గూడ

ఏళ్ళు ఒక కొన్ని వాలిన వేమి గాని
వాని తీవికి మోముకు వయసు లేదు
క్రూర భావాలు మనసున కూడనట్టి
మనుజునకు రాదు వార్ధక్య మలినరేఖ—

నాయకుడు ధర్మమంత్రి ఆననము జూచి
సచివు మోమును దిలకించి, సభను గాంచి
జలద గంభీర నినద విస్పష్ట భాష
లిట్లు లాడెను జనుల నాకట్టు కొంచు—

'మనది చెంచుల జాతి ఆత్మాభిమాన
గరిమచే వెలుగొందెడి ఘనత మనది
చెంచుకులమున బుట్టె ఆ సిరివెలంది
ఖ్యాతి గూర్చిన యట్టి ప్రఖ్యాత జాతి—.

జాతియేకాదు — మనకున్న నీతి ఘనము
నీతియేగాదు — మనమున్న రీతి ఘనము
ఒకరి జోలికి బోము — వేఁాకరు వచ్చి
వేలుబెట్టిన సహించి విడువలేము.

మరణము వచ్చి ముట్టినను
మానము వీడుట నీతిగాదు — సం
గరమున వెన్ను జూపి నర
కానికి జేరుట లెస్సగాదు — శ్రీ
చరణము లందుకొన్న మన
జాతి విశిష్టమెకాని — చెంచులన్
కరుణయు నేర్వగా వలయు
గాదె యొకించుక చింత సల్పుడీ!

రేపు కార్తీక పున్నమి రేయి గాన
లచ్చి జాతర జరుపుట లగ్గె యగును
వచ్చి చేరుడు గుండ్లమ్మ వాగు దరిన
హెచ్చు మోదాన వెన్నెల వచ్చుసరికి—

ఏటి కొక పండుగే మన కిద్ది చాలు
రేయి రేయెల్ల జాతర రేగవలయు
చెంచులును, చెంచుభామలు చేయు నాట్య
గానముల యందు లచ్చి పొంగారవలయు—

గాన నాట్యాలు తమ నేర్పు కళలు గాన
తరణి 'అంకి'దె వాని పెత్తనము రేపు
తినుడు, త్రాగుడు, పాడుడు దిక్కులదర
ఏమి మీకిచ్చయో చేయు డిచ్చదీర

అనుచు యేలిక వచియింప హర్షపులకి
తాంతరంగులైనారు వా రరిగినారు
మరు దినమ్మున రేయి సమ్మానమందు
కొత్త కథలల్లుకొను మత్త చిత్తులగుచు--


అంకిదే రేపు రాజ్య మటంచు పలుకు
నాయకుని మాట లవ్వి కర్ణముల సోక,
వెలది హర్షించినట్లు కన్పించె గాని
ఆమె మనసున మనసులే దంశమ్మైన —

వెలుగు వెంబడి చీకటి వెడలునట్లు
పగటె వెనువెంట రాతిరి పరుగునట్లు
మోదముల వెన్ను గాయుచు, ఖేదచయము
డాగి యుంట సహజము గదా ధరిత్రి!

ముందు రాతిరి చెంచు సాములకు ముందు
వేడి నాట్యాలతో కనువిందు జేసి
యువతి కాదిది నాట్య మయూరి యంచు
దొరలు పొగడిన 'అంకి' విద్రోహి నేడు

ముందు రాతిరి చెంచుల యిందుముఖుల
గూడి పాడి ముదమ్ము సేకూర్చి తాను
చెలియ కాదిది గానకోకిల యటంచు
భాషణములందు చిన్నది దోషి నేడు

ఎల్లవారికి తలనాల్క, ఎల్లవారి
కాప్త, ఆత్మీయ, అనురాగ, అనుగు చెలియ
నిన్నవర కామె—కాని ఆసన్నమైన
దుష్టకాలాన బద్ధ శత్రువుగ మారె




నిన్న చల్లిన వారు పన్నీటి యూట
నేడువిసినారు నిప్పు కణికలు నోట
గతము విసరిన మందమారుతము నేడు
చండ్ర గాడ్పుగ మారె కష్టలను నూరె

నిన్న అంకి పేరు విన్నచో ఒకసారు
నేడు అంకి తీరు చూడ వేరు
వెన్న గుత్తి యిపుడు విచ్చుకత్తిగ దోచె
ఎంత కెంత మార్పు యింతలోన

సాగి నిన్నటి రేయి నిశాంతమందు
తందనాలన్ని ముగిసిన తరుణమందు
సంబరాలన్ని చెలరేగి సమసినపుడు
చేడె దూరాన అద్దని నీడ జూచె

కలయికే ఒక్క చెంచెత కంటబడెను
చెంచి ప్రకటింప గూడెము చెవిన బడెను
నెమ్మదిగ నున్న ఒక తటాకమ్ము నందు
రాయి విసరిన అలలు పారాడునట్లు

పడతి చెలికానితో పట్టుబడ్డది తన
వారిచేతనే బంధింప బడ్డది—తను
చెలులతో చేరి నిత్యమే చెట్టు క్రింది
ఆడునో దాన కట్టి వేయంగబడెను

భావ చేసిన తప్పేమి? వలచె నొకని
వలపుగాని రహస్యాన గలసి కొనెను
వలచుటే తప్పా? వలచిన వాని గలసి
కొనుటె తప్పనా? యిట్లొనగూడె ముప్పు

ఎవ్వడో వైరి కుఱ్ఱ డిదేమి వచ్చి
చెంచెత నొకర్తె తాను ప్రేమించినాడ?
ఎన్ని గుండెలు వానికి? ఏమి చేసి
వాని దవుష్ట్యంబు కడతేర్చ వలయు నిపుడు

ఎంత తలవంపు తెచ్చె నీ యింతి అంకి
జాతి వేరైన వానికి నీతిమాలి
మనసు యిచ్చినదా? వాని మాత్రమెవడు
చెంచులందు లభింపడా? సిగ్గు! సిగ్గు!

కచ్చ గట్టిన చెంచులు రెచ్చిపోయి
రట్టుగా ప్రేమికుల నట్టె తిట్టినారు
వారిపై నూసి యవమాన పరచినారు
పెద్ద దొర బిల్చినారు చూపించినారు

అతడు బొమలెత్తి ఒకసారి అంకి దెసకు
'అసలు యిది నిజమా?' యనునట్లు జూచె
తరుణి చూపుల కేది మోదాలు లేవు
నిర్మలమ్మగు వదనమ్ము నిండు కుండ

అతడు కనులెత్తి నొకసారి యనుగు జనుల
డెందముల చప్పుడులను తానందు కొరకు
ప్రజల మోముల ద్వేష భావాలు గలవు
వారి మనసుల కచ్చల వహ్ని గలదు

కనుల నొడయుడు నిప్పులు గ్రక్కునంచు
కంటమందున పిడుగులు కదలు నంచు
ఎంచి చుట్టును నిలిచిన చెంచువారి
వూహ లారెను అతడున్న యునికి గాంచి

ఆత డులుకక పలుకక యువని నిలిచె
కదలికలు లేని రాతి విగ్రహము వోలె
అనిమిషత్వాన కొంత సేపట్టె చూచి
చెప్పడేమియు, కనుల ప్రశ్నించె నేమొ!


దేవరా! మీరు చెప్పినదే నిజమ్ము!
నేను యీతని ప్రేమించి నాను, జాతి
బేధ మెంచక వీని రావించినాను
కట్టడిని ధిక్కరించితి గాదె యిపుడు!

రాయడా! నేను పట్టి దవుర్భాగ్యురాల!
మాన్య నగుచును భవదభిమాన గరిమ
వెలిగితిని నిన్న నేడు దుర్విధి కతాన
తప్పు గానట్టి తప్పుకు తానమైతి

నాయకా నీకు నాకును నడుమనున్న
మమత యిది మన పూర్వ జన్మల ఫలమ్ము
కనక పోయిన నేమి నా జనకు డీవు
పుట్టకున్నను నీకు నే పుత్రినోదు

ఏలికా! మన ఇద్దరి నేలుచున్న
కూర్మి చట్టాని కడ్డు కాకూడ దెపుడు
పాడి దేవర మ్రోల యెవ్వార లైన
సరిసమానులు గారె వోసామి చెపుమ!

వినుడు నే నొక మాట చెప్పెదను దేవ
గాలియందరి నొకరీతి గారవించు
పూలు ఎల్లరికిని గంధములను జల్లు
ఏల మనుజుల మధ్య బేదాలు స్వామి.




ఒక్క యేటి నీటి నొప్పుగా ద్రావుచు
ఒక్క యడవి పండ్ల నొనర దినుచు
మనెడి మనుజులం దమానుష భంగి యీ
బేదమేల? వేరు వాద మేల?

అతివ జెప్పెడు మాటల నాలకించి
నాయకుని కన్ను లశ్రుకణాలు జార్చె,
జార్చె నాతడు తలపాగ, జార్చె కత్తి
పాడి దండంబు తన చేయి వీడ జార్చె.

జార్చినది పాగయే కాదు జార్చె నతడు
తనదు శీర్షపు నాయకత్వమును గూడ
జార్చి కత్తిని దండమున్, జడత విడిచి
జ్ఞానముద్రను గైకొన్న మునియాయె.

తాను చెంచుల మవధ్యమడంపలేడు
అంకి వట్టి వధింప లే డందుచేత
నాయకత్వమ్ము వదలి కాననము నందు
ఎచటికో నిశ్చలాత్ముడై యెగెనతడు

అతడు పోవు వెన్క అందరు పెద్దలే
తలొక మాట నాడి తరలలేదు
రక్కసులుగ మారి, రక్తోగ్ర నయనాల
గాంచి వారు క్రూరగాని నేత్రు

నేత్రులో దేలియాడుచునే యభాగ్య
ప్రేమికుడు వారి కిట్లు విన్పించినాడు
అతని మాటల నాలించె ననిలజమ్ము
మాత్రమే వినరు వా రణుమాత్రమైన

మానవులంద రొక్కటె సు
  మా! భగవానుని సృష్టి యందు యే
కానన సీమలందు గిరి
  కంధర ప్రాంతములందు నున్న గా

మీ! నడుమ యెవో గిరులు
  నీచులు గీచిరి పెత్తనమ్ముకై
కాన వసుంధరన్ గల దొ
  కావొక జాతియె, ఒక్క నీతియే—

జాతుల గూర్చి నట్టి వెర
  జాణ యెవండొ ఎరుంగలేము— ఏ
నీతిని బట్టి జాతులవి
  నిల్చినొ గూడ వచింపలేము— ఆ
రీతుల గోతులం దవిలి
  రెచ్చెడి మానవ కోటి యెట్లు వి
ఖ్యాతమొ చెప్పలేము విహా
  గంబుల కన్న, మృగాల కన్ననున్.

నేలతల్లి అమ్మ, నింగియే మన తండ్రి
చేలు పూలు వనులు చెలిమికాండ్రు
నదులు వనధులన్ని నమ్మిన నేస్తాలు
మనుజ లోకమె యనెడు మాట నిజము

అడవి గాచిన వెన్నెల యట్లు మారె
బండ దగిలిన గాజుల పగిది దీరె
గాలి గలసిన వాతని గద్గదాంత
రాళమున్ వెలువడ్డట్టి రావములవి

ంచుల వారు మద్యమును
  సేచన జేయుచు మత్తచిత్తులై
చించుక గొంతుకల్ మరి వ
  చించిరి చండ ప్రచండ భాషణల్
మించెను కాలమంచు, యిక
  మీదటి వారి కిదే గతంచు ము
ట్టించిరి యగ్ని చెట్టునకు
  తీవ్రపు కోపము జాజ్వలింపగన్

చెట్టు మండెను, చెట్టుకు గట్టి యున్న
వలపు జంటయు మండెను వహ్నియందు
కాని చెంచుల జాతివై రాన బుట్టు
కచ్చు మంటల బడలేదు కాలలేదు

మంటలవి పెచ్చు పెరిగెను, మారె పొగలు
గాగి, పొగలన్ని తీరె మేఘాలు గాగ,
మేఘములు కాళమై గ్రమ్మె మింటియందు
మింటి చీకటి వ్యాపించె మంటిమీద

గాలిదేవుడు కోపించె, కసరె విసరె
వాన వేలుపు కోపించి వ్రాలె యవని
కడవ చిల్లులు పడినట్లు పడెను వాన
పుడమి కన్నీరు మున్నీరు పొర్లి దోచె

వాన మారెను వాగుగా, వాగు నదిగ
నదియు మారెను నీరంబు నిధిగ నంత
ప్రణయమున చేటు వాటిల్లెనను విధాన
ప్రళయమున నూగిపోయె ప్రపంచమంత

గుండ్లకమ్మ గుండె కోపాన కుతకుత
ఉడికిపోయె జలము, సుడులు దిరిగె,
చెంచు గుంపు దుష్ట చేష్టకు కినిసి, తా
భీకరాన లేచి భీతి గొలిపె.

కన్ను పొడిచిన కనరాని కాళరాత్రి
మిన్ను విరిగిన చందాన మేళవించి
ఉప్పెనై సాగి, గుండ్లమ్మ ఉప్పరమున
కెగసి వూళ్ళను నాళ్ళు పైకెత్తి నైచె

తెల్లవారెను ఉప్పెన తీసిపోయె
గూడెముల్ లేవు చెంచులుగూడ లేరు
ఎరుకవారలు లేరు— వారిరువురకును
వైరముల్ లేవు ప్రేమల వరుస లేదు

ఉప్పెన కతాన శూన్యమై యుర్వియెల్ల
శాంత గంభీరమాన విశ్రాంతి దోచె
మవునమెంతటి భయదమో, మవునమందు
తడిసి గుండ్లమ్మ శోకగీతాలు పాడె

విన్న చిందులు ద్రొక్కె మున్నీటి వోలె
ఉప్పెనై సాగి దరులను వూడ్చివైచె
పిదప శాంతించి గళమెత్తి యెద దహింప
జాలి గీతాలు పాడు యుగాల నుండి

ఆ ప్రవాహమ్ము గళమెత్తి ఆలపింప
ఆకసము వినె, విన్నవా పైకతములు
వినెను చంద్రుడు, విన్నదా పిల్లగాలి
అడవి విన్నది, విన్నది పుడమి గూడ

తరలె నెన్నో యుగాలు అడ్డడును - లేదు
అరిగె నెన్నో శతాబ్దాలు అంకి లేదు
వారి ప్రేమయు కాలగర్భాన కలసె
దాని గుర్తుగ నేటి 'అద్దంకి' నిలచె.

(సమాప్తం)